UNIVERSITY OF CAMBRIDGE INTERNATIONAL EXAMINATIONS
General Certificate of Education Advanced Subsidiary Level

**TELUGU LANGUAGE** **8690/02**

Paper 2 Reading and Writing **October/November 2011**

**1 hour 45 minutes**

Additional Materials: Answer Booklet/Paper

**READ THESE INSTRUCTIONS FIRST**

If you have been given an Answer Booklet, follow the instructions on the front cover of the Booklet.
Write your Centre number, candidate number and name on all the work you hand in.
Write in dark blue or black pen.
Do not use staples, paper clips, highlighters, glue or correction fluid.

Answer **all** questions.
Write your answers in **Telugu** on the separate answer paper provided.
Dictionaries are **not** permitted.
You should keep to any word limits given in the questions.

At the end of the examination, fasten all your work securely together.
The number of marks is given in brackets [ ] at the end of each question or part question.

**ఈ సూచనలను ముందుగా చదవండి.**

మీకిచ్చిన సమాధాన పత్రంలోని ముఖపత్రం మీది సూచనలను పాటించండి.
నిర్దేశించిన స్థలాలలో మీ సమాధాన పత్రం/పత్రసంపుటి మీద మీ పేరు, కేంద్రం సంఖ్య, అభ్యర్థి సంఖ్య రాసి నింపండి.
ముదురు నీలం లేదా నలుపు రంగు సిరా కలాలనే వాడండి.
స్టేపిల్సు, పేపరు క్లిప్పులు, హైలైటర్లు, గ్లూ లేదా చెరుపుడు ద్రవాలు వాడకండి.

**అన్ని** ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
అందించిన సమాధాన పత్రంలో మీ సమాధానాలను **తెలుగులో** రాయండి.
పదకోశాలకు అనుమతి లేదు.
ప్రశ్నల్లో సూచించబడ్డ పదపరిమితిని పాటించండి.
పరీక్ష కాగానే సమాధాన పత్రాలను అన్నిటినీ ఒకటిగా గుదికూర్చి కట్టండి.
ప్రతి ప్రశ్నకు లేదా ప్రశ్నాంశానికి చివర [ ] కుండలీకరణం గుర్తుల్లో గుణాలు సూచించబడ్డాయి.

This document consists of **5** printed pages and **3** blank pages.

DC (SJF/CGW) 52170
© UCLES 2011

UNIVERSITY *of* CAMBRIDGE International Examinations

**[Turn over**

www.theallpapers.com

## విభాగం 1

ముందుగా ఈ మొదటి పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగు**లో జవాబులు రాయండి.

### గ్రామసీమలు

రాజు ఒక పాఠశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. అతని భార్య కమల కూడా మరొక పాఠశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నది. వాళ్ళు ఇప్పుడు గుంటూరులో ఉంటున్నారు. కమల పని చేస్తున్న బడి గుంటూరులోనే ఉంది. కాని రాజు పని చేసే బడి దగ్గరలో ఉన్న ఒక గ్రామంలో ఉంది. రాజు రోజూ బస్సులో వెళ్ళి వస్తూ ఉంటాడు. ఆ ఊరికి వెళ్ళే రోడ్డుకు ఇరు పక్కలా పంట పొలాలు ఉన్నాయి. వాటిని చూస్తే రాజుకు తన చిన్నతనం జ్ఞాపకం వస్తుంది. ప్రయాణం చేసినంత సేపూ ఆ పొలాలు చూస్తూ రాజు తన చిన్ననాటి జ్ఞాపకాలతో తన్మయత్వం చెందుతూ ఉంటాడు.

అసలు రాజు వాళ్ళ ఊరు ఒక పల్లెటూరు. అతని చిన్నతనంలో ఆ ఊరిని అతను ఎంతో ప్రేమించేవాడు. ఆ ఊరు కృష్ణానది ఒడ్డున ఉంది. రోజూ రాజు పొద్దునా సాయంత్రం తోటి పిల్లలతో కలిసి కృష్ణలో స్నానం చెయ్యటానికి వెళ్ళేవాడు. అందరూ కలిసి నదిలో ఆటలే ఆటలు; ఈతలే ఈతలు.

వ్యవసాయపు పనులంటే రాజుకు చాలా ఉత్సాహం. అతని తండ్రి ఒక సన్నకారు రైతు. స్కూలుకు సెలవు వచ్చినప్పు డల్లా రాజు తండ్రితో కలిసి పొలానికి వెళ్ళేవాడు. ఎండాకాలం వెళ్ళి తొలకరి వర్షాలు పడ్డప్పుడు నేల తడిసి వచ్చే వాసన అంటే అతనికి ఎంతో ఇష్టం. వర్షాలు మొదలైనతర్వాత ఏరువాక పౌర్ణమి వస్తుంది. అప్పుడు రైతులు దుక్కి దున్నుతారు. తండ్రి దుక్కి దున్నటానికి తెల్లవారు జామునే లేచి అరక కట్టుకొని పొలం వెళ్తాడు. అప్పుడు రాజు ఉదయం ఏడు గంటలకల్లా తండ్రికి చద్దెన్నం తీసుకు వెళ్తాడు.

హైస్కూలు చదువు పూర్తి అవుతూనే రాజు జీవితంలో ఒక పెద్ద మలుపు వచ్చింది. అతని తండ్రి చనిపోయాడు. వ్యవసాయం ఆగిపోయింది. అటువంటి పరిస్థితిలో గుంటూరులో ఉండే రాజు మేనమామ రాజును గుంటూరు తీసుకుపోయి తన దగ్గరే ఉంచుకొని కాలేజీలో చేర్పించాడు. ఆ విధంగా రాజు జీవితంలో కాలేజీ చదువు, పట్టణ నివాసం అనే మార్పులు వచ్చాయి. వ్యవసాయం మీద అతనికి ఉన్న మక్కువ కారణంగా వ్యవసాయ కళాశాలలో చేరాలని అతను ఎంతో ఆశ పడ్డాడు. కాని గుంటూరులో వ్యవసాయ కళాశాల లేదు; ఎక్కడికో పంపించి చదివించటానికి మేనమామ ఆర్థిక స్థితి అనుకూలించలేదు. అందువల్ల వ్యవసాయంలో పై చదువు చదవలేకపోయాడు. గుంటూరులోనే బి.ఎస్‌సి. చదివి తర్వాత ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసి సైన్సు టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. టీచరుగా పని చేస్తున్న కమలను పెళ్ళి చేసుకున్నాడు. వ్యవసాయంలో పై చదువు అయితే చదవలేదు గాని, తనకు ఉన్న ఉత్సాహం కారణంగా వ్యవసాయంలో మెళకువలు, భూసారం, ఎరువులు, మొదలైన విషయాలను గురించి చాలా తెలుసుకున్నాడు రాజు.

ఇప్పటికీ గ్రామాలలో రైతుల పరిస్థితి తన చిన్నతనం నాటి లాగానే ఉంది. అందుకని రాజుకు చాలా రోజులుగా తను పుట్టిన ఊరికి వెళ్ళి అక్కడి రైతులకు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను తెలిపి సహకార విధానంలో సన్నకారు రైతులు బలపడేలా చేయాలని గట్టి కోరిక ఉంది. ఇప్పుడు పని చేస్తున్న గ్రామంలో కూడా అతను రైతులను కలుసుకొని తనకు తెలిసిన విషయాలు వారికి చెప్తూ ఉంటాడు. ఈ సంవత్సరం ఎండాకాలం సెలవులలో రాజు కుటుంబంతో సహా తన గ్రామానికి వెళ్ళాలి అని, అక్కడ రైతులకు అక్షరాస్యతలోనూ, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను గురించి కొన్ని తరగతులు నిర్వహించాలి అని, ఆ విధంగా కొంత స్వచ్ఛంద సేవ చేయాలి అని తీర్మానించుకున్నాడు.

© UCLES 2011



www.theallpapers.com

**1** దిగువ పేర్కొన్న అర్థ వివరణలకు బాగా సరిపోయే పదాలు/పదబంధాలు పై పాఠ్యంలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

మాదిరి: పరవశత్వం
సమాధానం: తన్మయత్వం

(అ) బడి [1]
(ఆ) రెండు వైపులా [1]
(ఇ) మరణించాడు [1]
(ఈ)వివాహం [1]
(ఉ) బాల్యం [1]

[మొత్తం గుణాలు 5]

**2** కింద సూచించిన పదాలను/ పదబంధాలను వాటి అర్థం వ్యక్తం అయ్యేలా మీ సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.
మాదిరి: పనిచేస్తున్నాడు
సమాధానం: నా స్నేహితుడు ఒక బ్యాంకులో పనిచేస్తున్నాడు.

(అ) ప్రయాణం [1]
(ఆ) మలుపు [1]
(ఇ) మెళకువ [1]

బ్రాకెట్లలో సూచించిన పదాలను ఉపయోగించి వాక్యాలను తిరగ రాయండి.
మాదిరి: కమల పనిచేస్తున్న బడి గుంటూరులో ఉంది. [గుంటూరులో ఉన్న బడి]
సమాధానం: కమల గుంటూరులో ఉన్న బడిలో పనిచేస్తున్నది.

(ఈ) తండ్రి దుక్కి దున్నటానికి పొలం వెళ్లాడు. [పొలం వెళ్ళి] [1]
(ఉ) ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసి ఉద్యోగంలో చేరాడు. [ఉద్యోగంలో చేరటానికి ముందు] [1]

[మొత్తం గుణాలు 5]

**3** మీది పాఠ్యంలోని వాక్యాలనే మక్కికి మక్కి దించకుండా కింది ప్రశ్నలకు **తెలుగు**లో సమాధానాలు రాయండి.

(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించబడ్డాయి. భాషా పాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) రాజు ఎవరు? అతను రోజూ బస్సులో ఎక్కడికి వెళ్ళివస్తూ ఉంటాడు? ఎందుకు? [3]
(ఆ) రాజు ప్రయాణంలో తన్మయత్వం చెందటానికి కారణం ఏమిటి? [2]
(ఇ) రాజు చిన్నతనంలో తోటి పిల్లలతో కలిసి ఏం చేసేవాడో రాయండి. [2]
(ఈ) రాజు జీవితంలో వచ్చిన పెద్ద మలుపు ఏమిటి? దాని వల్ల వచ్చిన మార్పులు ఏమిటి? [3]
(ఉ) రాజు వ్యవసాయంలో పై చదువు చదవలేకపోవటానికి కారణాలు తెలపండి. [2]
(ఊ) రాజు ఎండాకాలంలో ఏమేం చేయాలని తీర్మానించుకున్నాడు? [3]

[మొత్తం గుణాలు 20]


www.theallpapers.com

## విభాగం 2

ఇప్పుడు ఈ దిగువ నున్న రెండో పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగులో** జవాబులు రాయండి.

### గ్రామాభివృద్ధి – దేశాభివృద్ధి

గ్రామాలు ఖాళీ అవుతున్నాయి; జనానికి గ్రామాలలో ఉపాధులు దొరకటం లేదు; చాలామంది సమీప పట్టణాలకు నగరాలకు వలస పోతున్నారు – ఇటువంటి వార్తలు తరచుగా వింటూ ఉంటాం. ఇట్లా జరగటానికి కారణం ఏమిటి? దీనికి కారణం ఒకటి కాదు; చాలా కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి: ఆధునిక కాలానికి తగిన అవసరాల కల్పన గ్రామాలలో నత్తనడక నడుస్తూ ఉండటం; చదువుకున్నవారు తమకు గ్రామాలలో ఉపాధి దొరకదు అనే భావనలో ఉండటం. ఈ రోజులలో చదువుకున్నవారు ఎక్కువ కావటంతో గ్రామాల నించి జనం పట్టణాలకు వలస పోవటం కూడా ఎక్కువ అవుతున్నది. చదువుకున్నవారిలో కూడా కొంతమంది గ్రామాలలో స్థిరపడి వ్యవసాయమో, ఏదైనా స్వయం ఉపాధి మార్గమో చూసుకుందాం అనుకునేవారు లేకపోలేదు. అటువంటి వారు ఎదుర్కొనే మొదటి సమస్య వారి పిల్లలకు కావలసిన మంచి విద్య గ్రామాలలో దొరకకపోవటం. రెండవ సమస్య మంచి వైద్యం దొరకకపోవటం.

ఇవి ప్రధానంగా కనిపించే సమస్యలే అయినా, మరొక సమస్య కూడా ఉంది. గ్రామాలలో ఆధునిక కాలానికి సరిపడే గృహ వసతులు తగినంతగా లేకపోవటం. అయితే చాలా మంది ఈ అసౌకర్యాన్ని అంతగా పట్టించుకోవటం లేదు. మంచి విద్య, మంచి వైద్యం దొరికితే చాలు అనేదే వారి భావన. ప్రధానంగా విద్య, వైద్యం అనేవి గ్రామాలలో ఇంకా మెరుగు పడాల్సిన అవసరం ఉంది అని అందరూ అంగీకరిస్తారు.

ఈ విషయంలో కూడా గ్రామాలలో ఇటీవలి కాలంలో ఒక మెరుగుదల కనిపిస్తున్నది. అది మూడు విధాలుగా కనిపిస్తున్నది. ఒకటి: మంచి పాఠశాలలు, మంచి వైద్యాలయాలు గ్రామాలలో కూడా వెలుస్తున్నాయి. రెండు: సమీప పట్టణాలకు రోడ్డు సౌకర్యాలు బాగా మెరుగు పడి, గ్రామాలలో నివసించే పిల్లలు సమీప పట్టణంలోనో, నగరంలోనో ఉన్న మంచి పాఠశాలలలో చదువుకునేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. మూడు: చాలా పాఠశాలలు పరిసర ప్రాంతాలకు బస్సులు నడుపుతూ పిల్లలకు – ఖర్చుతో కూడినదే అయినప్పటికీ – సులభమైన రవాణా సౌకర్యం కలిగిస్తున్నాయి. ఈ విధంగా గ్రామ జీవనం సౌకర్యవంతం అవుతున్నప్పటికీ, ఇంకా ఎన్నో లోటుపాట్లు ఉన్నాయి. ఈ విషయంలో సాధించ వలసిన అభివృద్ధి చాలా ఉంది. అట్లా అన్ని గ్రామాలలోనూ సౌకర్యాలు మెరుగు పడి ప్రజాజీవనం సుఖప్రదం అయితే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది అని సమాజ పరిశీలకులు చెప్తారు.

అయితే, ఇక్కడ మరొక అంశం కూడా చెప్పుకోవలసి ఉంది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం. అందువల్ల దేశానికి రైతు వెన్నెముక వంటివాడు అని గుర్తించాలి. అంతే కాకుండా గ్రామాల ప్రాధాన్యాన్ని కూడా గుర్తించవలసి ఉంటుంది. అటువంటి గ్రామాలలో నివసించే ప్రజలు వ్యవసాయం మీదా, వ్యవసాయాధారిత వృత్తుల మీదా ఆధారపడి జీవిస్తూ ఉంటారు. కనుక వ్యవసాయంలోనూ, దానికి సంబంధించిన ఇతర వృత్తులలోనూ శాస్త్రీయ విధానాలను ప్రవేశపెట్టి ఆధునీకరించటం చాలా ముఖ్యం. అప్పుడు ఆయా వృత్తులవారికి గ్రామాలలో తగిన పని దొరికి ఉపాధి లభిస్తుంది. గ్రామాలు సర్వతోభిముఖమైన అభివృద్ధిని సాధించి, దేశాభివృద్ధికి దోహదం చేస్తాయి.



www.theallpapers.com

**4** పై పాఠ్యంలోని వాక్యాలనే మక్కికి మక్కి దించకుండా కింది ప్రశ్నలకు **తెలుగులో** సమాధానాలు రాయండి.

(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించబడ్డాయి. భాషా పాటవానికి అదనంగా గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) ఎటువంటి వార్తలు మనం తరచుగా వింటూ ఉంటాం? [3]

(ఆ) గ్రామాలనుంచి జనం పట్టణాలకు నగరాలకు ఎందుకు వలస పోతున్నారు? [2]

(ఇ) గ్రామాలలో స్థిరపడాలనుకునే చదువుకున్నవారు ఎదుర్కొనే సమస్యలను మూడింటిని పేర్కొనండి. [3]

(ఈ) గ్రామాలలో ఇటీవలి కాలంలో కనిపిస్తున్న మెరుగుదల గురించి వివరించండి. [3]

(ఉ) వ్యవసాయాధారిత దేశం కావటం వల్ల గుర్తించవలసిన అంశాలు ఏమిటి? [2]

(ఊ) వ్యవసాయంలోనూ దానికి సంబంధించిన ఇతర వృత్తులలోనూ శాస్త్రీయ విధానాలను ప్రవేశపెట్టటం వల్ల ఏం జరుగుతుంది? [2]

[మొత్తం గుణాలు 20]

**5** మీరు ఇప్పుడు చదివిన పై రెండు పాఠ్యాలలోని గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను క్రోడీకరించి రాయండి. [10]

ఈ రెండు పాఠ్యాల మీద మీ స్పందనను తెలపండి. [5]

మీ సమాధానం మొత్తం 140 పదాలకు మించకుండా తెలుగులో రాయండి.

[భాషా పాటవానికి: 5]

[మొత్తం గుణాలు 20]



www.theallpapers.com

**BLANK PAGE**

© UCLES 2011

www.theallpapers.com

**BLANK PAGE**

© UCLES 2011

www.theallpapers.com

**BLANK PAGE**

Permission to reproduce items where third-party owned material protected by copyright is included has been sought and cleared where possible. Every reasonable effort has been made by the publisher (UCLES) to trace copyright holders, but if any items requiring clearance have unwittingly been included, the publisher will be pleased to make amends at the earliest possible opportunity.

University of Cambridge International Examinations is part of the Cambridge Assessment Group. Cambridge Assessment is the brand name of University of Cambridge Local Examinations Syndicate (UCLES), which is itself a department of the University of Cambridge.

© UCLES 2011



www.theallpapers.com